AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

20-11-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## ప్రపంచ ఛాంపియన్ గా నిఖత్



**అక్షరటుడే, ఇందూరు:** మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఇందూరు క్రీడాకారిణి నిఖత్ జరీన్ బంగారు పతకం కైవసం చేసుకుంది. 51 కిలోల విభాగంలో గురువారం సాయంత్రం చైనీస్ తైపి క్రీడా కారిణి గువో జీ జువాన్‌పై 50 తేడాతో గెలుపొందింది. మ్యాచ్ మొదటినుంచి తన పంచులతో దూకుడు ప్రదర్శిస్తూ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. గత 20 నెలలుగా ప్రపంచ వేదికల్లో ఎక్కడ పథకం సాధించని నిఖత్ మళ్లీ ఫాంలోకి వచ్చింది. బంగారు పతకం సాధించడంపై జిల్లా క్రీడాకారులు అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



## పిల్లల అక్రమ రవాణాను అరికట్టాలి

**అక్షరటుడే, ఇందూరు :** చిన్నారుల అక్రమ రవాణా ను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర చారి అన్నారు. మహిళ శిశు సంక్షేమ శాఖ బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని రామకృష్ణ మఠంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ మాట్లాడుతూ జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, రక్షణ హక్కు చిన్నారులకు ఉంటాయన్నారు. వాటన్నింటిని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. పిల్లలు ఎలాంటి వివక్షకు గురి కాకుండా వారి సమగ్రత అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. అనంతరం వివిధ అంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారిణి రసూల్‌బీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అశ్విని, డాక్టర్ రవి కిరణ్, సీడబ్ల్యూసీ సభ్యులు రాజేంద్రప్రసాద్, డీసీపీవో చైతన్య కుమార్, జీసీడీవో భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## కామారెడ్డిలో కార్డన్ సెర్చ్..

### 235 వాహనాలు స్వాధీనం

**అక్షరటుడే, కామారెడ్డి :** పట్టణంలోని బతుకమ్మ కుంటలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని గురువారం తెల్లవారు జామున నిర్వహించారు. కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 4 గంటల నుంచి 200 మంది సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో నంబర్ ప్లేట్ లేనివి, ట్రాఫిక్ నియమాలు పాటించని 235 బైకులు, ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ప్రజల భద్రత కోసం పోలీసుల నిరంతర చర్యలు ఉంటాయని పోలీసులు పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆమె సూచించారు.



## మంత్రిని అడ్డుకున్న రైతులు

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో పర్యటించిన మంత్రి సీతక్కను రైతులు అడ్డుకున్నారు. భిక్కనూరు మండలంలో పర్యటన పూర్తి చేసుకుని సిరికొండ వెళ్తున్న మంత్రిని రామారెడ్డి వద్ద రైతులు, బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సన్నాలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమం లో మంత్రి సీతక్క రైతులపై అసహనం వ్యక్తం చేశారు. మీరు రైతులేనా.. ఏదైనా అడగాలంటే టైం తీసుకుని రావాలి.. నేను వేరే ఊరు వెళ్తున్న అంటూ కారెక్కి వెళ్లి పోయారు. దాంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు అడగడానికి వస్తే ఇలా మాట్లాడడం సరికాదన్నారు.

నిజామాబాద్ నగరంలోని పలు భవనాల నిర్మాణాలకు అడ్డగోలుగా అనుమతులు జారీ చేసినట్లు తెలుస్తోంది. సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించక పోయినా, నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టకున్నా నగర పాలక సంస్థ అధికారులు ఎవరికి నచ్చినట్లు వారు పర్మిషన్లు ఇచ్చారు. కాగా తాజాగా కార్పొరేషన్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహించగా.. ఈ విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

- అక్షరటుడే, నిజామాబాద్







# అడ్డగోలుగా అనుమతులు..

■ నిబంధనలు పాటించకున్నా.. పట్టించుకోని అధికారులు ■ పెద్దఎత్తున అక్రమాలు ■ భవనాల అనుమతులపై తాజాగా ఏసీబీ ఆరా

నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో గతంలో పని చేసిన టీపీవోల హయాంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు సమాచారం. ప్రత్యేకించి సెట్ బ్యాక్ నిబంధనలు ఉల్లంఘించిన రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలకు ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. నగరంలోని ప్రధాన రహదారులు వెంట ఉన్న కమర్షియల్ బిల్డింగ్‌లు నిబంధనల ప్రకారం లేకపోయినా.. వాటికి రాత్రికి రాత్రే కార్పొరేషన్ నుంచి అనుమతులు మంజూరు చేశారు. కొన్నింటికి ట్యాక్స్ అసెస్‌మెంట్ ఇవ్వడం గమనార్హం.

### ఉల్లంఘనలు ఇలా..

వర్ని రోడ్డులో ఓ కమర్షియల్ భవనం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగింది. ఈ భవనం బీజేపీకి చెందిన మాజీ కార్పొరేటర్‌ది కావడంతో ఎలాంటి నిబంధనలు పాటించకపోయినప్పటికీ జరిమానాలు ఏవీ విధించకుండా నేరుగా ట్యాక్స్ అసెస్‌మెంట్ జారీ చేశారు. దీంతో నగర పాలక సంస్థ ఆదాయానికి భారీగా గండి పడింది.


మాలపల్లిలో ఓ కమర్షియల్ బిల్డింగ్, కేసీఆర్ కాలనీలో ఓ వాణిజ్య సముదాయం, ఎల్లమ్మ గుట్టలో మరో బిల్డింగ్‌కు సంబంధించిన దస్త్రాలను అధికారులు పరిశీలించారు. వీటి అనుమతుల జారీ సమయంలో కూడా పెద్ద ఎత్తున ఉల్లంఘనలు జరిగినట్లు తెలుస్తోంది. 2023-25 మధ్య కాలంలో జారీ చేసిన భవనాల అనుమతుల ఫైల్స్‌పై ఏసీబీ లోతుగా విచారణ చేపట్టింది.

ఖిల్లా రోడ్డులోని రెండంతస్తులకు అనుమతి తీసుకొని ఐదు అంతస్తుల బిల్డింగ్ నిర్మించారు. అప్పటి అధికారులు బల్డింగ్ యజమానికి అన్ని విధాలా అండదండలు అందించారు.

పులాంగ్ చౌరస్తా సమీపంలో కొనసాగుతున్న ప్రముఖ ఐ హాస్పిటల్ భవనం కూడా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని గుర్తించారు. కాగితాల్లో ఒక విధంగా.. నిర్మాణంలో మరో విధంగా ఉన్నప్పటికీ అనుమతులు ఇచ్చారు. దీనిపైనా అధికారులు విచారణ జరిపారు. ఇదే బిల్డింగ్‌కు సమీపంలో కొనసాగుతున్న ఓ ప్రైవేట్ పాఠశాల భవనం సైతం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగింది. దీనికి సైతం కార్పొరేషన్ అధికారులు నిబంధనలను పక్కన పెట్టి ట్యాక్స్ అసెస్‌మెంట్ జారీ చేశారు.

## మార్కెట్ యార్డుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి: మంత్రి సీతక్క

**అక్షరటుడే, కామారెడ్డి :** వ్యవసాయం బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, అందుకే మార్కెట్ యార్డుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క అన్నారు. భిక్కనూరు మండలంలో రూ. 92.80 లక్షల వ్యయంతో చేపట్టిన వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతును రాజుగా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మార్కెటింగ్ కమిటీ కాంప్లెక్స్‌లో 11 షాపులు, మీటింగ్ హాల్, టాయిలెట్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యమని, రైతులు పండించే ప్రతి పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తూ వారికి అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కార్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజు, గ్రంథాలయ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## కేంద్రం విత్తన చట్టంపై సదస్సు



**అక్షరటుడే, ఆర్మూర్:** కేంద్రం తీసుకొచ్చిన విత్తన చట్టం-2025పై హైదరాబాద్‌లోని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. విత్తనాభివృద్ధి సంస్థ, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. విధాన విశ్లేషకులు దొంతి నరసింహా రెడ్డి, అగ్రి-హార్టికల్చర్ సొసైటీ చీఫ్ అడ్వైజర్ నల్లమల్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. చర్చించిన అంశాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందించనున్నారు.

## నగర శివారులో అల్ప్రాజోలం పట్టివేత..

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** గుట్టుచప్పుడు కాకుండా మత్తుపదార్థాలను తరలిస్తున్న ముగ్గురిని నార్కోటిక్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నార్కోటిక్స్ ఎస్‌హెచ్‌వో పూర్ణేశ్వర్ వివరాలు వెల్లడించారు. నగర శివారులోని గంగాస్థాన్ సమీపంలో మత్తుపదార్థాల సరఫరా జరుగుతోందనే పక్కా సమాచారం మేరకు నార్కోటిక్స్ పోలీసులు నిఘా వేశారు. ఆ మార్గంలో ముగ్గురు అనుమానిత వ్యక్తులు ప్రయాణిస్తున్న కారును ఆపి తనిఖీలు చేశారు. కారులో రూ.1.50 లక్షల విలువ చేసే 150 గ్రాముల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని రూరల్ పోలీసులకు అప్పజెప్పినట్లు ఎస్‌హెచ్‌వో పూర్ణేశ్వర్ పేర్కొన్నారు.



## జిల్లాలో పర్యటించిన విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు

**అక్షరటుడే, ఇందూరు :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల్లో రాష్ట్ర పరిశీలకులు శివకృష్ణ గురువారం పర్యటించారు. ప్రభుత్వ పాఠశాల ల్లో కొనసాగుతున్న ప్రత్యేక పనులు, శుభ్రత, జాగ్రత్తలు తదితర అంశాలను పరిశీలించారు. మాణిక్ భండార్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల లో శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను కూల్చిన ప్రాంతాన్ని, సైన్స్ ల్యాబ్ గ్రంథాలయాలను సందర్శించారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాల సందర్శించి వంటగదిని తనిఖీ చేశారు. విద్యార్థులను అడిగి భోజనం వివరాలు తెలుసుకున్నారు. అలాగే మాక్లూర్, మాదాపూర్ కేజీబీవీలను సందర్శించి పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను ఇతర అంశాల నివేదికలను తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నారు. ఆయన వెంట ఎంఈవోలు సత్యనారాయణ గంగాధర్ తదితరులున్నారు.

## బీఎంబీ మల్టీ లెవెల్ మార్కెటింగ్ చైన్ సిస్టం నిందితుల అరెస్ట్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** పేద, మధ్యతరగతి ప్రజలను మోసగించిన బీఎంబీ మల్టీ లెవెల్ మార్కెటింగ్ చైన్ సిస్టం నిందితులను అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్టోబర్ 13న కోటగల్లిలోని కెనరా బ్యాంక్ పక్కన ఉన్న బీఎంబీ కంపెనీని చూసిన ఫిర్యాదుదారుడు తోకల బక్కన్న కంపెనీని సందర్శించాడు. ఆ కంపెనీ ప్రతినిధులు సదరు కంపెనీ ఇంగ్లాండ్ దేశానికి చెందినదని.. దీంట్లో పెట్టుబడి పెట్టి కంపెనీ యాడ్స్‌కు రేటింగ్ ఇవ్వడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని నమ్మబలికారు. దీంతో బాధితుడు కంపెనీ ప్రతినిధి చంద్రశేఖర్ ప్రసాద్ మాటలు నమ్మి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో సుమారు రూ.84వేల వరకు పెట్టుబడి పెట్టాడు. అలాగే మరి కొంతమందిని సైతం ఈ మల్టీలెవల్ మార్కెటింగ్ చైన్ సిస్టమ్ కంపెనీలో చేర్పించాడు. అయితే తాను పెట్టిన పెట్టుబడి, లాభాలు విత్‌డ్రా కాకపోవడంతో మోసపోయానని గుర్తించిన బక్కన్న వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు సైబర్ క్రైం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. అనంతరం గురువారం మధ్యాహ్నం రెండుగంటల ప్రాంతంలో సదరు బీఎంబీ ప్రతినిధులను అదుపులోకి తీసుకున్నట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. సదరు నిందితుడు ఈ విధంగా సుమారు 22 మందిని మోసం చేసినట్లు తెలిసిందని సీపీ తెలిపారు. అయితే చైన్ స్టిస్టం ద్వారా ఈ కంపెనీలో పెట్టుబడులు పెట్టి సుమారు 750 మంది వరకు మోసపోయినట్లుగా తెలిసిందన్నారు. బాధితులు బీఎంబీ కంపెనీలో పెట్టుబడి పెట్టిన డబ్బుల విలువ రూ. కోటికి పైగా ఉంటుందని ఆయన వివరించారు. ప్రస్తుతం బీఎంబీ కంపెనీకి చెందిన యాప్ పనిచేయడం లేదన్నారు. కంపెనీ పంపిన లింకులన్నీ కూడా చైనా బేస్డ్ లింకులను ఆ లింక్‌ల ద్వారా పంపిన రూ.1.50 కోట్లు చైనా బేస్డ్ లింక్‌లకు డైవర్ట్ అయినట్లు సమాచారం ఉందన్నారు. మోసపూరిత ప్రకటనలకు ప్రజలు ఆకర్షితులు కావొద్దని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఎవరు కూడా ఇలాంటి మోసపూరిత మల్టీ లెవెలింగ్ మార్కెటింగ్ చైన్ సిస్టంలో లాభాలు వస్తాయని పెట్టుబడులు పెట్టవద్దని సూచించారు. ఎవరైనా ఇలాంటి సంస్థల్లో మోసపోయి ఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.



## 'సర్' ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సన్నాహక ప్రక్రియను పొరపాట్లకు తావులేకుండా పక్కాగా పూర్తి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కమ్మర్‌పల్లి, ఆర్మూర్ తహశీల్దార్ కార్యాలయాలను గురువారం సందర్శించారు. తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో ఎస్ఐఆర్ సన్నాహక ప్రక్రియ అమలు, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం కోసం చేపట్టిన చర్యలపై సమీక్షించారు. 2002 ఓటరు జాబితాతో ప్రస్తుత 2025 ఓటరు జాబితాను సరిపోల్చుతూ వివరాలు రూపొందించారా అని పరిశీలించారు. నిర్దిష్ట గడువులోపు 'ఎస్ఐఆర్' సన్నాహక ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. భూభారతి, గ్రామ రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల్లో ఇంకా ఏవైనా అర్జీలు పెండింగ్‌లో ఉంటే, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. ఆయా మాడ్యూల్స్‌లో వచ్చిన దరఖాస్తులు ఎన్ని, సాదాబైనామా అర్జీల్లో ఎన్ని ఆమోదం పొందాయి. ఎన్ని దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి.. పీవోటీ భూములకు సంబంధించిన దరఖాస్తులు ఎన్ని తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సాదాబైనామా దరఖాస్తులకు సంబంధించి అర్హులైన వారు ఉన్నట్లు గుర్తిస్తే, అలాంటి వారికి తగిన న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. చిన్నచిన్న కారణాలతో దరఖాస్తులను రిజెక్ట్ చేయకూడదని, క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలన జరిపి అర్హులుగా నిర్ధారణ అయిన వారి దరఖాస్తులను ఆమోదించాలన్నారు. ఒకవేళ దరఖాస్తులను తిరస్కరిస్తే, అందుకు ఉన్న కారణాలను స్పష్టంగా పేర్కొనాలని, అవి భూభారతి మార్గదర్శకాలకు లోబడి ఉండాలన్నారు. ఆమోదం పొందిన వాటితో పాటు తిరస్కరణకు గురైన సాదాబైనామా దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో రెండు రోజుల్లోపు పూర్తిస్థాయిలో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా పలు దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి తహశీల్దార్లు ప్రస్తావించిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేస్తూ, వాటిని ఏ మాడ్యుల్‌లో పరిష్కరించవచ్చనే అంశాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ వెంట కమ్మర్‌పల్లి, తహశీల్దార్ ప్రసాద్, ఆర్మూర్ తహశీల్దార్ సత్యనారాయణ తదితరులున్నారు.






## బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే..

**అక్షరటుడే, ఇందూరు :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్‌లో గురువారం మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ జేఏసీ రాష్ట్ర కోచైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపుమేరకు రోజుకోవిధంగా నిరసన తెలుపుతున్నామన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత అని గుర్తుచేశారు. రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా అమలు చేశాకే పంచాయతీ ఎలక్షన్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, శంకర్, రవీందర్, సాయి, అజయ్, శ్రీలత, చంద్రకాంత్, బాలన్న, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.




## ఉద్యోగుల ఉన్నతే టీఎన్జీవోస్ లక్ష్యం

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఉద్యోగుల ఉన్నతే టీఎన్జీవోస్ లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్‌కుమార్ పేర్కొన్నారు. ఆర్మూర్ యూనిట్ అధ్యక్షుడు కె.శశికాంత్ రెడ్డి, కార్యదర్శి విశాల్ అధ్యక్షతన గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాశెట్టి సుమన్ కుమార్, నేతికుంట శేఖర్ హాజరై సభ్యత్వాన్నిఉద్యోగులకు అందజేశారు. ఈ సందర్భంగా సుమన్‌కుమార్ మాట్లాడుతూ.. టీఎన్జీవోస్ ప్రాముఖ్యతను సవివరంగా తెలియజేసి.. ప్రతి ప్రాథమిక సభ్యుడు సన్మానం కోసం కాకుండా సమస్యల అర్జీలతో టీఎన్జీవోస్ కార్యాలయానికి రావాలని తెలియజేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని రానున్నారని తెలిపారు. అన్ని శాఖల ఉద్యోగులు, టీఎన్జీవోస్ నాయకులు మెగా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు అతీక్ అహ్మద్, సంయుక్త కార్యదర్శి విశాల్ రెడ్డి, వెల్ఫేర్ శాఖ జిల్లా అధ్యక్షుడు సురేష్, ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్, శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## వంటకాల్లో నాసిరకం పదార్థాలు వాడితే చర్యలు



**అక్షరటుడే: బోధన్:** విద్యార్థుల కోసం చేసే మధ్యాహ్న భోజనంలో నాసిరకం పదార్థాలు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రత అధికారిణి సునీత, సహాయక ఆహార భద్రత అధికారిణి నవిత హెచ్చరించారు. ఎడపల్లి మండలంలోని జానకంపేట్‌లో జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆహార ముడి పదార్థాల కొనుగోలు బిల్లులను కలిగి ఉండాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు సూచించారు. నాసిరకం ముడిపదార్థాలను ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

## డయల్ 100ను దుర్వినియోగం చేసి వ్యక్తికి జైలు

**అక్షరటుడే, మెండోరా:** డయల్ 100ను దుర్వినియోగం చేసిన వ్యక్తికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. మెండోరా ఎస్సై సుహాసిని తెలిపిన వివరాల ప్రకారం.. మెండోరా గ్రామానికి చెందిన సందేశ్‌బాబు అనే వ్యక్తి మద్యం మత్తులో డయల్ 100కు ఫోన్ చేసి పోలీసు సమయాన్ని వృథా చేశాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆర్మూర్ కోర్టులో ప్రవేశపెట్టారు. విచారించిన సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సందేశ్‌బాబుకు నాలుగురోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్సై సుహాసిని తెలిపారు.



భీమ్‌గల్ పేరుకే మున్సిపాలిటీ అయినప్పటికీ సౌకర్యాల కల్పనలో అట్టడుగు స్థానంలో నిలుస్తోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టణవాసులు కనీస మౌలిక వసతులు కరువై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేజర్ గ్రామపంచాయతీ నుంచి పురపాలికగా మారడంతో పట్టణం ప్రగతి పథంలో దూసుకెళ్తుందని ఆశించిన భీమ్‌గల్ వాసులకు నిరాశే మిగిలింది. భీమ్‌గల్ పురపాలికకు రూ.11.5 కోట్లు మంజూరైన నేపథ్యంలో పరిష్కరించాల్సిన పురపాలక సమస్యలపై 'అక్షరటుడే' ప్రత్యేక కథనం..

– అక్షరటుడే, భీమ్‌గల్

# భీమ్‌గల్ పురపాలిక..
# సమస్యలకు వేదిక..!

- పట్టణంలో సమస్యల దరువు
- గాడితప్పిన పాలన
- యథేచ్ఛగా ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు

భీమ్‌గల్ పట్టణంలోని విద్యానగర్, నందిగల్లి, బాపూజీ నగర్, బడా భీమ్‌గల్ రోడ్డు, వేల్పూర్ రోడ్డు, బైపాస్ రోడ్డు, శ్రీరాం నగర్, రాజారాం నగర్ తదితర కాలనీలు అపరిశుభ్రంగా కనిపిస్తాయి. ఇళ్ల మధ్య మురుగు కాల్వలు లేకపోవడంతో నీరు నిలుస్తోంది. దీంతో పట్టణవాసులు అనారోగ్యానికి గురవుతున్నారు. సీసీ, బీటీ రోడ్లు నిర్మించలేదు. చిన్నపాటి వర్షానికి కాలనీలు నీట మునుగుతున్నాయి. మొగిలిచెరువు నుంచి అయ్యప్ప నగర్ కాలనీ మీదుగా చెరువులోకి నీరు వెళ్లేందుకు గతంలో ఉన్న కాలువ పూర్తిగా కబ్జాకు గురైంది. కాలువను బాగుచేస్తే అయ్యప్ప నగర్, వేల్పూర్ రోడ్డు వెంట ఇళ్లను ముంపు నుంచి కాపాడుకోవచ్చని మండలవాసులు పేర్కొంటున్నారు.

### భీమ్‌గల్ స్వరూపమిది..

- వార్డులు 12
- కాలనీలు 18 పైగా..
- పట్టణ జనాభా 26 వేలకు పైగా..
- నివాసాలు 5,600
- పారిశుధ్య కార్మికులు 58 మంది



### రోడ్లు, డ్రెయినేజీలపై దృష్టిసారిస్తాం..

పట్టణంలో ప్రధానంగా అంతర్గత రోడ్లు మురికి కాల్వలపై దృష్టి సారిస్తాం. గతంలో ఈ రెండింటిపై తీర్మానం జరిపి నిర్మించాలని నిర్ణయించాం. ఈ క్రమంలో మురికి కాల్వల నిర్మాణం, రహదారుల నిర్మాణం చేపడతాం. అలాగే పట్టణంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. అక్రమ నిర్మాణాలపై నోటీసులు అందజేసి తగుచర్యలు తీసుకుంటాం.

– గోపు గంగాధర్, మున్సిపల్ కమిషనర్, భీమ్‌గల్

### ప్రధాన సమస్యలివే..

- రాథం చెరువు పెద్దమొత్తంలో కబ్జాకు గురైంది. కబ్జా చేసిన స్థలాన్ని దర్జాగా అమ్ముకుంటున్నారు. చెరువులో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.
- చెత్తను సేకరించి వాహనాలు మరమ్మతుల గురవుతున్నాయి. చెత్త సేకరణ అంతంత మాత్రమే ఉంది.
- సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో వేసి కాల్చేస్తున్నారు. దీంతో పక్కనే ఉన్న కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.
- మూడేళ్ల కిందట ప్రారంభించిన వందపడకల ఆస్పత్రి, సమీకృత మార్కెట్ భవనం నిర్మాణాలు నిలిచిపోయాయి. నిర్మాణాలను తిరిగి ప్రారంభించి రెండు భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
- పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. పదుల సంఖ్యలో రెండు నుంచి ఐదు అంతస్తుల భవనాలు వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపాల్సి ఉంది.
- పట్టణవాసుల సౌకర్యార్థం రూ.30 లక్షలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు నిర్వహణ లేక వృథాగా పడి ఉన్నాయి.

## అంగన్‌వాడీ విద్యార్థులకు పలకలు, కుర్చీల అందజేత

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రానికి ఓరా సంతోష్, స్నేహంజలి దంపతులు తమ కుమార్తె కృతిక పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు పలకలు, కుర్చీలను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు వాటిని అందజేస్తున్నట్లు సంతోష్ తెలిపారు. విద్యార్థులకు కుర్చీలు, బెంచీలు అందజేసిన దాతలను ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారులకు స్వీట్లను అందజేశారు.





## రేవంత్ రెడ్డిపై యువరైతు అభిమానం

**సీఎం రేవంత్‌రెడ్డిపై యువరైతు అభిమానం చాటుకున్నాడు. ఆలూర్ మండలం కల్లెడి గ్రామానికి చెందిన సిరికొండ మహేష్ సీఎంపై తన అభిమానాన్ని వినూత్నంగా ప్రదర్శించాడు. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న మహేశ్ తన పొలంలో వరి ధాన్యంతో పెద్ద అక్షరాల్లో జై కాంగ్రెస్– రేవంత్ రెడ్డి అని రాసి తన అభిమానాన్ని చాటుకున్నాడు.** – అక్షరటుడే, ఆర్మూర్

## విధులను ఆటంకపర్చిన ముగ్గురి అరెస్ట్





**అక్షరటుడే, ఆర్మూర్:** పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు నందిపేట ఎస్సై శ్యాంరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. నందిపేట మండలం షాపూర్ రోడ్డులో బుధవారం సాయంత్రం డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఆ సమయంలో పోశెట్టి అనే వ్యక్తికి డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ చేస్తుండగా వెనకాలే వచ్చిన ఎర్రం పవన్‌తో పాటు నందిపేటకు చెందిన ఎర్రం చరణ్, ఎర్రం కిరణ్‌లు పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. పోలీసుల వద్ద ఉన్న డ్రంకన్ డ్రైవ్ పరికరాలను తీసుకునేందుకు యత్నించారని ఎస్సై పేర్కొన్నారు. ఎస్సై 2 రామ్ ఫిర్యాదు మేరకు ముగ్గురుపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

## ఎడపల్లిలో అమానవీయ ఘటన..

### కన్నకూతురిపై తండ్రి లైంగిక వేధింపులు

**అక్షరటుడే, బోధన్:** ఎడపల్లిలో అమానవీయ ఘటన చోటుచేసుకుం ది. ఓ తండ్రి కూతురిపైనే లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఎస్సై రమ తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కూతురిపై కొన్నిరోజులుగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఆయన భార్య కొన్ని నెలలుగా ముంబ యిలో ఉంది. అయితే ఇంట్లోని తన కూతురిపై సదరు ప్రబుద్ధుడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఇటీవల తల్లి స్వగ్రామానికి చేరుకోగా తండ్రి చేస్తున్న నిర్వాకాన్ని కూతురు చెప్పింది. దీంతో ఆమె తన భర్తపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే రెండురోజుల క్రితం ఆయన మళ్లీ కూతురిపై లైంగికదాడి యత్నించడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## వైన్‌షాప్‌ను తొలగించాలి

**అక్షరటుడే, కోటగిరి :** మండల కేంద్రంలోని వైన్ షాప్‌ను తొలగించాలని కోరుతూ స్థానికులు రాస్తారోకో చేశారు. ఈ మేరకు గురువారం తహశీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎత్తొండ రోడ్డులోని వినాయక్‌నగర్ కాలనీవాసులు మాట్లాడుతూ.. తమ కాలనీ ప్రాంతంలో ఉన్న వైన్ షాప్, పర్మిట్ రూంను తొలగించాలని డిమాండ్ చేశారు. వైన్స్ షాపు కాలనీలోనే ఉండడంతో మహిళలు, స్కూల్ పిల్లలు, కళాశాలకు వెళ్లే యువతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో లింగారాం, విజయ్, డాన్ రాజు, సాయిలు, గజ్జు, శ్రీనివాస్, సిరాజ్, అల్మాస్, ముజీబ్, హమీద్, వహీద్, రశీద్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరుపై హర్షం

**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండలంలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పోచారం, ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్ మాట్లాడుతూ.. పోతంగల్ మండలం చెక్ పోస్ట్ నుంచి హున్సా వరకు రోడ్డు కోసం రూ. 30 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గైక్వాడ్ హన్మంత్, కాంగ్రెస్ నాయకులు, గంధపు పవన్, హంగర్గా గంగాధర్, కేశ వీరేశం, మాణిక్, పులకంటి సాయిలు, వర్ని శంకర్, హన్మంత్ రావు, గంట్ల విఠల్ పాల్గొన్నారు.

## రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భారత రాజ్యాంగం అంశంపై 9, 10 తరగతి విద్యార్థులకు మండలస్థాయి పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల నుండి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాజ మినోజ్ఞ, కీర్తనలకు ఎంఈవో నరేందర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




## 108 అంబులెన్స్ తనిఖీ

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలో 108 అంబులెన్స్‌ను ఉమ్మడి నిజామాబాద్, నిర్మల్ జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ రామలింగేశ్వర రెడ్డి తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న మందులు, వైద్య పరికరాలు వాటి స్థితిగతులు తెలుసుకున్నారు. వాటి నిల్వలు చూసి రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. గర్భిణులను ప్రసవ సమయంలో ఆస్పత్రికి అంబులెన్స్‌లోనే తరలించేలా క్షేత్రస్థాయి వైద్య సిబ్బందితో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తనిఖీల సమయంలో ఈఎంటీ విజయ్ కుమార్, పైలట్ శ్రీనివాస్ ఉన్నారు.